
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
18-9-2025 (Thursday) MAIN EDITION

## తక్కువ ధరకే బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ ప్లాన్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశంలో ప్రైవేట్ టెలికాం కంపెనీలకు గట్టి పోటీ ఇస్తూ బీఎస్ఎన్ఎల్ మరో అద్భుతమైన ప్రీపెయిడ్ ఆఫర్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే 'ఫ్రీడమ్ ఆఫర్'తో రూ.1కే నెల రోజుల పాటు నెట్, అన్‌లిమిటెడ్ కాల్స్ ఆఫర్ ఇచ్చి ఆకట్టుకున్న బీఎస్ఎన్ఎల్, ఇప్పుడు కేవలం రూ.199కే కొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. రూ.199 ప్లాన్ డీటెయిల్స్ పరిశీలిస్తే.. 28 రోజులు రోజుల వాలిడిటీతో నిత్యం 2GB (డేటా అయిపోయిన తర్వాత స్పీడ్ 40kbps), అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు రోజుకు 100 ఫ్రీ ఎస్ఎంఎస్‌లు ఇస్తోంది.

## క్రెడిట్ కార్డ్ యూజర్లకు బ్యాడ్ న్యూస్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** క్రెడిట్ కార్డుతో రెంట్ పేమెంట్ చేస్తున్న వారికి ఫిన్‌టెక్ సంస్థలు చేదువార్త చెప్పాయి. ఇకపై రెంట్ పేమెంట్ ఆప్షన్‌ను తొలగిస్తున్నట్లు ప్రకటించాయి. క్రెడ్, ఫోన్‌పే, పేటీఎం వంటి సంస్థలు ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపాయి. చాలా మంది క్రెడిట్‌కార్డ్ వినియోగదారులు రెంట్ పేమెంట్ ఆప్షన్ ద్వారా నగదును బదిలీ చేసుకుని తమ అవసరాలకు వాడుకుంటున్నారు. అయితే ఈ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడానికి ఆర్‌బీఐ చర్యలు చేపట్టింది.

## బ్యాంక్ మేనేజర్ కొలువులు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ :** బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నవారికి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శుభవార్త తెలిపింది. మేనేజర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా 350 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్, సీనియర్ మేనేజర్, మేనేజర్ (స్కేల్ 2, 3, 4, 5, 6) పోస్టులను భర్తీ చేయనుంది. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు https://bankofmaharashtra.in/currentopenings వెబ్ సైట్ లో సంప్రదించవచ్చు.

## నిరుద్యోగులకు నితీశ్ శుభవార్త



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర ప్రభుత్వం అక్కడి ప్రజలపై వరాల జల్లు కురిపిస్తోంది. తాజాగా నిరుద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా మరో ప్రకటన చేసింది. డిగ్రీ చదివిన నిరుద్యోగులకు నెలకు రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ గురువారం ప్రకటించారు. 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయ్ భట్టా యోజన' కింద గ్రాడ్యుయేట్ డిగ్రీలు పొందిన నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 1,000 చొప్పున రెండేళ్ల పాటు అందిస్తుందని తెలిపారు. గతంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ఈ పథకం వర్తించేది. ఇప్పుడు డిగ్రీ చదివిన వారికి కూడా వర్తిస్తుందని 'ఎక్స్'లో నితీశ్ ప్రకటించారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొంత కాలంగా సంచలన వ్యాఖ్యలతో కలకలం రేపుతున్నారు. మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తిలో ఉన్న ఆయన సొంత పార్టీ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు తప్పదని వ్యాఖ్యానించే దాకా వెళ్లిపోయారు. రాజగోపాల్‌రెడ్డి అన్ని హద్దులు దాటుతున్నా కాంగ్రెస్ పార్టీలో మాత్రం కదలిక రావడం లేదు. ఆయనపై చర్యలు చేపట్టడం లేదు. గతంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విషయంలో వేగంగా స్పందించి వేటు వేసిన అధికార పార్టీ.. ఇప్పుడు కోమటిరెడ్డి వ్యవహారంలో వ్యవహరిస్తున్న వైఖరిపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ నాయకుడి విషయంలో వేగంగా నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై మాత్రం ఆచితూచి వ్యవహరిస్తుండడం హస్తం పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. **–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# కొరకరాని కొయ్యగా కోమటిరెడ్డి

- పార్టీ, ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి
- చర్యలు తీసుకోని అధిష్టానం
- సర్వత్రా చర్చనీయాంశం

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి స్వయాన సోదరుడు అయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారారు. రెండోసారి జరిగిన మంత్రివర్గ విస్తరణ తర్వాత ఆయన సొంత పార్టీపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. మొదట్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లో చేరి గెలిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారని.. కానీ ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. మిగతా వాళ్లలా పదవులను అడ్డం పెట్టుకుని సంపాదించుకునే వాడిని కానని, ప్రజల కోసమే పదవి అడుగుతున్నానని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలను సైతం పలుమార్లు తప్పుబట్టారు. కాళేశ్వరం అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై చర్చించేందుకు ఇటీవల ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించగా, దాన్ని కూడా తప్పుబట్టారు. రాష్ట్రంలో వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇంత అర్జెంట్‌గా సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పనికి రాని సమావేశాలకు తాను హాజరు కాబోనని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తానని ప్రకటించారు. ఇలా పలుమార్లు ఆయన కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యవహరించారు.

### తిరుగుబాటు తప్పదంటూ..

యువత తలుచుకుంటే రాష్ట్ర సర్కారును కూల్చేస్తారంటూ ఇటీవల కోమటి రెడ్డి రాజ గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. యువతను ఉద్యోగాల పేరుతో ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించిన ఆయన.. అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న హామీని విస్మరించిందన్నారు. అలాగే గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షల ద్వారా యువతకు న్యాయం చేస్తామన్న హామీ నిలబెట్టుకోలేదన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని.. ఈ అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువతతో ఆడుకున్న ప్రభుత్వాలు మనుగడ సాధించ లేవని, నేపాల్‌లో యువత తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని కూల్చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నేపాల్ తరహాలో యువత తిరగబడి ప్రభుత్వాన్ని కూల్చేయడం ఖాయమంటూ హెచ్చరించారు. కోమటిరెడ్డి నేరుగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండడం కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

### చర్యలకు వెనుకడుగు..


కాంగ్రెస్ పార్టీని ఇప్పటికే ఎన్నోసార్లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇబ్బందుల్లోకి నెట్టారు. కానీ పార్టీ మాత్రం ఆయనపై చర్యలు తీసుకునేందుకు సాహసించట్లేదు. కోమటిరెడ్డి విషయంలో పార్టీ నాయకత్వం ఎందుకు స్పందించడం లేదన్నది అంతుచిక్కడం లేదు. ఆయనపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు ధైర్యం చేయట్లేదో పార్టీ కేడర్ కూడా ప్రశ్నిస్తోంది. ఎమ్మెల్యే స్థానంలో ఉండి పార్టీ గీత దాటుతున్నా కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవడానికి కాంగ్రెస్ పెద్దలెవరూ స్పందించకపోవడం గమనార్హం. ఇతర ఎమ్మెల్యేలు, నాయకులు మాట్లాడితే చర్యలు తీసుకునే క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ.. రాజగోపాల్‌రెడ్డి విషయంలో పట్టించుకోక పోవడాన్ని నాయకులు ప్రస్తావిస్తున్నారు. గతంలో తీన్మార్ మల్లన్న విషయంలో వేగంగా నిర్ణయం తీసుకుని ఆయనను వెలేసినప్పుడు, కోమటిరెడ్డి విషయంలో అంత వేగంగా ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అంటే బీసీల విషయంలో ఒక రకంగా, రెడ్ల విషయంలో మరో రకంగా వ్యవహరించడంపై చర్చించుకుంటున్నారు.

## కవిత రాజీనామాపై మండలి ఛైర్మన్ గుత్తా కీలక వ్యాఖ్యలు..



**అక్షరటుడే, హైదరాబాద్:** ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేయడంపై శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్గొండలో గురువారం తనను కలిసిన విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన కవిత రాజీనామాపై స్పందించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ కవిత పంపిన లేఖ అందిందని చెప్పారు. అయితే, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. కవిత తనకు ఫోన్ చేసి రాజీనామా విషయాన్ని చెప్పారని, దానిని ఆమోదించాలని కోరారని తెలిపారు. అయితే, ఎమోషనల్‌గా రాజీనామా చేశారని, దీనిపై పునరాలోచించుకోవాలని వెల్లడించారు. రాజీనామాపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

## కవితతో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ భేటీ



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ గురువారం భేటీ అయ్యారు. రెండు గంటల పాటు ఆమెతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన కవిత సొంతంగా పార్టీ పెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె జాగృతి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆమె ఎవరికి మద్దతు ఇస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న పలువురు ఆమెను కలుస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## అద్దె చెల్లించలేదని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం



**అక్షరటుడే, బోధన్ :** బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి భవనం యజమానులు తాళం వేశారు. ఆఫీసుకు సంబంధించి సుమారు 30 నెలల అద్దె బకాయిలు రూ.20 లక్షలు చెల్లించాల్సి ఉంది. యజమానులు ఎన్నిసార్లు కోరినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో గురువారం ఉదయం కార్యాలయానికి తాళం వేశారు. దీంతో అధికారులు బయటే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు సైతం బయటే ఉండిపోయారు.

## వారిని ఎన్నికల సంఘం కాపాడుతోంది..

**రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు**



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారు. దేశంలో లక్షల ఓట్లను ఈసీ తొలగించిందన్నారు. రాహుల్ గాంధీ కొంతకాలంగా ఓటు చోరీ పేరిట ఈసీపై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఆయన గురువారం మాట్లాడారు. కొందరు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో లక్షలాది మంది ఓటు హక్కును కావాలనే తొలగించారన్నారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న వారిని కాపాడుతోందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

### కాంగ్రెస్ బలంగా ఉన్నచోట..

కాంగ్రెస్ బలంగా ఉన్నచోట ఓట్లను తొలగిస్తున్నారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల తొలగింపుపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు తొలగించారని చెప్పారు. అధికారులకు తెలియకుండా ఓట్లు ఎలా పోతాయని ఆయన ప్రశ్నించారు. కొందరు వ్యవస్థలను హైజాక్ చేసి ప్రజలకు తెలియకుండా వారి ఓటు హక్కు తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓట్లు తొలగించాలని ఓటర్ల పేరిట దరఖాస్తు చేస్తున్నారని చెప్పారు. అంతేగాకుండా ఇతర రాష్ట్రాల ఫోన్ నంబర్లు ఉపయోగించి ఓట్లు తొలగించారన్నారు. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లను తీసేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## నేపాల్ ప్రధానికి మోదీ ఫోన్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** నేపాల్‌లో శాంతి, స్థిరత్వానికి భారత్ నిరంతర మద్దతును కొనసాగిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి సుశీలా కర్కికి గురువారం ఫోన్ చేసి మాట్లాడారు. నేపాల్‌లో ఇటీవల జరిగిన ప్రాణనష్టంపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. పొరుగు దేశంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో భారతదేశం నిరంతర మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో నేపాల్‌కు మద్దతుగా నిలిచేందుకు భారతదేశ దృఢమైన నిబద్ధతను ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## ట్రంప్ బంగారు విగ్రహం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని యునైటెడ్ స్టేట్స్ క్యాపిటల్ భవనం వద్ద డొనాల్డ్ ట్రంప్ బంగారు విగ్రహం ఏర్పాటు చేశారు. 12 అడుగుల ఎత్తుతో ఈ విగ్రహం పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో బిట్‌కాయిన్‌ను పట్టుకుని నిలబడి ఉన్నారు. దీనిని వెండి, అల్యూమినియంతో రూపొందించి.. దానిపై బంగారం పూత వేసినట్లు తెలుస్తోంది. ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) వడ్డీ రేటు కట్ నిర్ణయం ప్రకటించిన కాసేపటికే విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

## అనసూయ క్రేజ్ తగ్గినట్టేనా..!



తెలుగు బుల్లితెరపై తనదైన మార్కుతో గుర్తింపు తెచ్చుకున్న యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఎప్పటిలాగే సోషల్‌మీడియా వేదికగా హల్‌చల్ చేస్తోంది. తరచూ తన గ్లామరస్ ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతున్న అనసూయ.. ఈసారి నెదర్లాండ్ వెకేషన్ ఫొటోలతో ఆకట్టుకుంటోంది. సముద్రతీరాల్లో విహరిస్తున్న అనసూయ అక్కడి బ్యూటీఫుల్ లొకేషన్స్‌లో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. అవి కాస్తా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. అనసూయ ప్రస్తుతం సినిమాల కంటే ఎక్కువగా టెలివిజన్ షోలపై దృష్టి పెట్టింది. ఇటీవల "కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్" షోలో జడ్జిగా వ్యవహరించిన ఆమె, పలు ఈవెంట్లు, షాపింగ్ మాల్ ఓపెనింగ్స్‌లోనూ పాల్గొంటోంది. అయితే ఇప్పుడు అనసూయ చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. దీంతో బుల్లితెరపై మళ్లీ జోరు పెంచాలనే ఆలోచనలో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది.

**–అక్షరటుడే, సినిమా డెస్క్**